# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 06-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ శరద్ పూర్ణిమ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు.

❖ శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలలో భారతదేశం ప్రపంచ శక్తిగా ఎదుగుతోందని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

❖ బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ను కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేసింది.

❖ దేశ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు రాష్ట్రపతి భవన్‌లో 2022-2023 సంవత్సరానికి గాను మై భారత్ - నేషనల్ సర్వీస్ స్కీమ్ (NSS) అవార్డులను ప్రదానం చేశారు. NSS యూనిట్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, NSS వాలంటీర్లకు 40 అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేశారు. సమాజ సేవ, దేశ నిర్మాణంలో NSS వాలంటీర్లు, యూనిట్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్ల సహకారాన్ని గుర్తించడానికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం జాతీయ సేవా పథకం అవార్డును ప్రదానం చేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ పౌరులకు శరద్ పూర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినం దేశ ప్రజలందరికీ శ్రేయస్సు, ఆనందం, ఆరోగ్యాన్ని కలగజేయాలని ఆకాంక్షించారు. లక్ష్మీదేవి, చంద్రుని ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభిలషించారు.

= = = = = = = = = = = = = = = = = = =

బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ను కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేసింది. రెండు దశల్లో ఈ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ప్రధాన ఎన్నికల కమీషనర్ గ్యానేష్ కుమార్ వివరాలను వెల్లడిస్తూ... బీహార్ లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11వ తేదీల్లో ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. నవంబర్ 22లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామని సీఈసీ గ్యానేష్ కుమార్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడంలో విద్య ముఖ్య పాత్ర పోషిస్తుందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 20వ FICCI ఉన్నత విద్యా సదస్సులో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగేందుకు విద్యా రంగం బలోపేతం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే విద్య చాలా కీలకమని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ప్రతిభావంతులైన, నైపుణ్యం కలిగిన యువత భారతదేశంలో ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ తరాల అభివృద్ధికి విద్యా, పరిశోధనలు ఎంతో అవసరమని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలలో భారతదేశం ప్రపంచ శక్తిగా ఎదుగుతోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్ క్లేవ్ - ESTIC 2025ను కేంద్రమంత్రి ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత దశాబ్దంలో అందుకున్న సాంకేతిక ప్రోత్సాహం ఫలితంగానే నేటి దేశ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి జరుగుతోందన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి దేశ గౌరవాన్ని పెంచుతుందని తెలిపారు. శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలలో ప్రపంచంలోని అగ్రశ్రేణి దేశాలలో భారత్ ఒకటిగా నిలుస్తుందన్నారు. ESTIC వంటి సమావేశాలు భవిష్యత్ తరం ప్రతిభను వెలికితీసే వేదికలుగా మారాయని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

జైపూర్‌లోని సవాయి మాన్ సింగ్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రోగుల భద్రత, చికిత్స, బాధితుల సంరక్షణ కోసం ప్రభుత్వ యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాజస్థాన్‌లోని జైపూర్ సవాయ్ మన్ సింగ్ (ఎస్ఎమ్ఎస్) ఆసుపత్రిలో నిన్న రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండవ అంతస్తులోని ట్రోమా ఐసీయూలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఐసీయూలో ఉన్న ఆరుగురు పేషంట్లు చనిపోగా, గాయాలైన ఐదుగురికి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా, కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = =

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ న్యూఢిల్లీలో యూనిటీ మార్చ్‌ను ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఈ యూనిటీ మార్చ్ కేవలం ఒక స్మారకోత్సవం మాత్రమే కాదని, దేశ నిర్మాణంలో యువతను నిమగ్నం చేయడంతో పాటు ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి ఒక జాతీయ ఉద్యమం వంటిదని అన్నారు. యువతలో ఐక్యత, దేశభక్తి, పౌర బాధ్యతను ప్రేరేపించడం దీని లక్ష్యమని తెలిపారు. ఈ ఐక్యతా యాత్ర

స్వావలంబన, స్వదేశీ సందేశాన్ని తెలియజేస్తుందని, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ ఐక్యతా ప్రచార యాత్ర మొదటి దశ ఈనెల 31 నుండి నవంబర్ 25 వరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలోనూ నిర్వహించబడుతుంది.

= = = = = = = = = = = = = = = = = = =

ఇంధన రంగానికి వెన్నెముక అయిన బొగ్గు జాతీయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని నామ్‌చిక్-నామ్‌ఫుక్‌లో తొలి వాణిజ్య బొగ్గు గనికి కేంద్రమంత్రి ఈరోజు భూమి పూజ, ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టును కొత్త ఆశకు చిహ్నంగా అభివర్ణించారు. ఈశాన్య భారతదేశ అభివృద్ధి, ఇంధన భద్రతకు ఇది ఒక ముఖ్యమైన అడుగుగా పేర్కొన్నారు. నామ్‌ఫుక్ బొగ్గు గని 1.5 కోట్ల టన్నుల బొగ్గు నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉందని, ఇది అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని కేంద్రమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని బొగ్గు క్షేత్రాలను క్రియాత్మకంగా మార్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయని కిషన్ రెడ్డి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశపు రెండవ యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ "యాన్డ్రోత్" (Androth) యుద్ధ నౌక ఈరోజు భారత నావికాదళంలోకి ప్రవేశించింది. విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యాన్డ్రోత్ రాకతో భారత నావికాదళం సామర్థ్యం బలోపేతం అవుతుందన్నారు. ఈ నౌక ప్రవేశంతో నేవీ యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ పరాక్రమం గణనీయంగా పెరుగుతుందని, ముఖ్యంగా సముద్ర జలాల్లో ప్రమాదాలను ఎదుర్కోవడంలో ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలతో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 81 వేల 208 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 582 పాయింట్ల లాభంతో 81 వేల 790 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 183 పాయింట్ల లాభంతో 25 వేల 077 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 82 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =